

కార్యక్రమంలో పాల్గొన్న మిస్టర్ వరల్డ్ సిల్వర్ మెడలిస్ట్ మీర్ మోతేషామ్

ప్రపంచ సైకిల్ దినోత్సవం

రాయదుర్గం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఎజైకిల్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సైక్లింగ్ ఔత్సాహికులు, వివిధ కమ్యూనిటీ నాయకులతో పాటు విశిష్ట అతిథులను ఒకచోట చేర్చి సైక్లింగ్ వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మిస్టర్ వరల్డ్ సిల్వర్ మెడలిస్ట్ మీర్ మోతేషామ్, ఎజైకిల్ సీఈఓ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోతేషామ్ మాట్లాడుతూ.. తనకు శిక్షణతో పాటు జీవితంలో సైక్లింగ్ ఒక ముఖ్యమైన భాగమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవనశైలిని, పరిశుభ్రమైన వాతావరణాన్ని ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పల్లకీ సేవలో వేంకటేశ్వరస్వామి

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సర్దార్‌పటేల్‌నగర్‌లోని లక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి నవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని మోహినీ అలంకారంలో పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగులకు టోపి పెట్టిన వ్యక్తి రిమాండ్

పేట్‌బషీరాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని పేట్‌బషీరాబాద్ పోలీసులు మంగళవారం రిమాండ్ చేశారు. సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి జయభేరికాలనీ బాలాజీ రెసిడెన్సీ అపార్టుమెంట్‌లోని ఫ్లాట్ నెంబరు 204లో నివాసం ఉంటున్న కెతావత్ సంతోష్(33) నిరుద్యోగులకు ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ.3 నుంచి రూ.6 లక్షల వరకు డబ్బు వసూలు చేశాడు. వీరిని నమ్మించేందుకు నకిలీ హాల్‌టికెట్లు, అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చి వారిని తప్పించుకుతిరుగుతున్నాడు. ఈనెల 1వ తేదీన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు నిందితుడు సంతోష్ కోసం గాలిస్తుండగా కొంపల్లిలో అనుమానాస్పందంగా తిరుగుతుండగా పట్టుకున్నారు. నిందితుడిని విచారించగా ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని 40 మంది నుంచి రూ. కోటి వరకు వసూళ్లు చేసినట్టు అంగీకరించాడు. నేరాన్ని ఒప్పుకోవడంతో పేట్‌బషీరాబాద్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పేట్‌బషీరాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి 2 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్‌కిరణ్ నిందితుడి వివరాలు వెల్లడించా రు. ఒడిస్సాకు చెందిన బాదుల్లా కరడా మూసాపేట మెట్రోస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అతడిని పట్టుకుని తనిఖీ చేయగా 2 కిలోల ఎండు గంజాయి లభించింది. అతడిని బాలానగర్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాష్‌చంద్ర, ఎస్‌ఐ వెంకటేష్ సిబ్బంది ఉన్నారు.



గురువులను సన్మానిస్తున్న రమణాచారి

కళలకు నిలయం గానసభ

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయగానసభలోని నాలుగు వేదికల్లో కళా ప్రదర్శనలు, పలురంగాలలో ప్రముఖుల చిత్రపటాలు ఆడిటోరియంలో ఏర్పాటుతో గానసభ కళలకు నిలయంగా, కళామయంగా మారిందని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. ఎందరో మహానుభావుల పేరిట గత కాలపు ప్రఖ్యాతులను స్మరిస్తూ చేస్తున్న కార్యక్రమాలు అద్వితీయమన్నారు. గానసభ వ్యవస్థాపక దినోత్సవం రెండవరోజు కార్యక్రమం మంగళవారం జరిగింది. గానసభ నాట్యగురువు తులసి శిష్యబృందంచే కూచిపూడి నాట్యప్రదర్శన, సంగీత గురువు సుష్మ బృందం గానగోష్ఠి ఆకట్టుకుంది. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. గుండవరపు హనుమంతరావు సహకారంతో గానసభ నిర్మాణం జరిగిందన్నారు. తొలిప్రదర్శన గానసభలో ఇచ్చి దేశవిదేశాల్లో ప్రదర్శనలకు వివిధ రంగాల వారు వెళ్లేవారన్నారు. శ్రీనివాస్, ఉష పాల్గొన్నారు.

పొంగులేటి టీమ్ శ్రమ.. కంటోన్మెంట్ ఫలితం



రఘునాథ్‌యాదవ్

సికింద్రాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ఉప ఎన్నిక జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి టీమ్ శ్రమించిన తీరు ప్రస్తుతం అందరి ప్రశంసలు అందుకుంటోంది. కంటోన్మెంట్ గెలుపు బాధ్యతలను తనకు ముఖ్యమంత్రి అప్పజెప్పడంతో పొంగులేటి తన టీమ్‌తో సహా రంగ ప్రవేశం చేశారు. యువనేత రఘునాథ్‌యాదవ్‌ను ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో రఘునాథ్‌యాదవ్ అటు పొంగులేటికి, ఇటు కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకులకు సమన్వయకర్తగా వ్యవహరించారు. స్థానికంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలను నిశితంగా గమనించి, కేడర్‌తో సంప్రదింపులు జరుపుతూ, ఎన్నికల్లో విజయం కోసం వ్యూహాన్ని రచించారు. గెలుపు కోసం అనుసరించవలసిన తీరును మంత్రి పొంగులేటికి ఎప్పటికప్పుడు చెబుతూ, సూచనలను పాటిస్తూ, కేడర్‌ను ఉత్తేజపరచారు. కంటోన్మెంట్‌లోని 8 వార్డులకు, మోండ మార్కెట్ డివిజన్‌కు ప్రత్యేక ఇన్‌చార్జిలను సైతం నియమించి, వారంతా రేయింబవళ్లు శ్రమించేలా రఘునాథ్‌యాదవ్ కృషి చేశారు. కాంగ్రెస్ పార్టీ పాత నాయకులను, కొత్తగా పార్టీలో చేరిన వారిని సమానంగా చూసి, వారంతా పార్టీ గెలుపు కోసం సమష్టిగా పని చేసేలా చొరవ చూపారు.

అప్పుడే పుట్టిన శిశువు మృతి

- **కుటుంబ సభ్యులు, బీఆర్‌ఎస్, సీపీఎం నాయకుల నిరసన**

చాంద్రాయణగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అప్పుడే పుట్టిన శిశువు మృతిచెందింది. జంగమ్మెట్ రవీంద్రనాయక్ నగర్ కాలనీకి చెందిన రాజు కుమార్తె పింకీ మొదటి కాన్పు కావడంతో ప్రసవం కోసం జంగమ్మెట్ ప్రసూతి ఆస్పత్రిలో సోమవారం ఉదయం చేర్పించారు. రాత్రి 8 గంటలకు ప్రసవం చేసిన వైద్యులు చాలాసేపటి వరకు శిశువుకు సంబంధించిన సమాచారం కుటుంబసభ్యులకు చెప్పలేదు. మగ శిశువు ఆరోగ్యం బాగాలేదంటూ నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. నర్సులు ప్రసవం చేయడంతోనే శిశువు మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు, సీపీఎం, బీఆర్‌ఎస్ నాయకులు ఆస్పత్రి ఎదుట నిరసన చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుత్బుల్లాపూర్‌లో ప్రతీరౌండ్‌లో

ఈటల ఆధిక్యం

కుత్బుల్లాపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రతీరౌండ్‌లో మెజార్టీ సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డికి ఈటల రాజేందర్‌కు మధ్య ప్రతీ రౌండ్‌లో 5 నుంచి 6వేల ఓట్ల ఆధిక్యత కనబరిచారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మూడో స్థానంలో నిలిచారు. గతంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో 85 వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన బీఆర్‌ఎస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల్లో మూడో స్థానానికి పడిపోయింది. ఈ నియోజకవర్గంలో 7,24,992 మంది ఓటర్లున్నారు. 50.19 శాతం పోలింగ్‌తో 3 లక్షలా 63 వేలా 874 మంది ఓటు వేశారు. బీజేపీకి 1లక్షా 77 వేలా 122 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 1లక్షా 20 వేలా 957 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ పార్టీకి 58 వేలా 039 ఓట్లు వచ్చాయి. నోటాకు 2 వేలా 322 ఓట్లు రాగా, 56 వేలా 165 ఓట్లు బీజేపీ ఆధిక్యంలో నిలిచింది.

- **అల్లాపూర్‌లో సంబరాలు**

అల్లాపూర్: ఈటల రాజేందర్ గెలుపుతో అల్లాపూర్ డివిజన్‌లో బీజేపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఆ పార్టీ మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో గాయత్రినగర్ గాంధీ విగ్రహం కూడలిలో బాణాసంచా పేల్చి సంబురాలు చేశారు.



గాయత్రినగర్ గాంధీ విగ్రహం వద్ద సంబరాల్లో బీజేపీ కార్యకర్తలు

లక్షకుపైగా ఓట్లు సాధించిన బీజేపీ

కూకట్‌పల్లి: మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ ప్రత్యర్థి పార్టీల కంటే సుమారు లక్షకుపైగా ఓట్లు సాధించింది. కూకట్‌పల్లిలో మొత్తం 2 లక్షలా 31 వేలా 879 ఓట్లు పోలవ్వగా.. బీజేపీకి 1 లక్షా 09 వేలా 820 ఓట్లు, కాంగ్రెస్ 84 వేలా 700లు, బీఆర్‌ఎస్ 32 వేలా 788 ఓటుల, నోటాకు 1510.. చొప్పున ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ 25 వేలా 120 ఓట్ల మెజార్టీ సాధించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీ కొంతమేర పుంజుకొంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 65 వేల ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో అదనంగా 20 వేల ఓట్లను పెంచుకొంది.



షాపూర్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద విజయోత్సవాలు నిర్వహిస్తున్న నాయకులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, శేఖర్‌యాదవ్, భరత్‌సింహారెడ్డి, శంకర్‌రెడ్డి, రావుల శేషగిరి తదితరులు

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీకే పట్టం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు బీజేపీకే పట్టం కట్టారు. నాలుగు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు వరుసగా మూడోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించగా అందుకు అనూహ్యంగా ప్రజలకు బీజేపీ వైపు మొగ్గు చూపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 7,52,325 మంది ఉన్నారు. 633 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా పార్లమెంట్ ఎన్నికల్లో 3,25,398 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో బీజేపీకి 1,75,249 ఓట్లు రాగా రెండో స్థానంలో కాంగ్రెకు 1,04,472 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్‌కు మూడో స్థానం 42,687 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గాంధీకి 1,57,332 ఓట్లుతో గెలుపొందగా, బీజేపీకి 80,148 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన బీజేపీ అనూహ్యంగా మొదటి స్థానంలో నిలిచింది.

3వ స్థానానికి గులాబీ పార్టీ



ఎన్నికల్లో ప్రచారం చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి (ఫైల్)

దుండిగల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఏడింటినీ గెలుచుకున్న బీఆర్‌ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో 3వ స్థానంలో నిలిచింది. నాడు సాధించిన ఓట్లలో సగం కూడా సాధించలేక పోయింది. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీపై ప్రజలు ధిక్కారం పార్లమెంట్ ఎన్నికల్లో కనిపించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో 3.55 లక్షల మెజార్టీ సాధించిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు.. ప్రస్తుతం లోక్‌సభ ఫలితాల్లో ఆ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ప్రజలు 3వ స్థానానికే పరిమితం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు 9 లక్షలా 38 వేలా 64 ఓట్లు సాధించారు. అందులో మేడ్చల్ నియోజకవర్గంలో 1 లక్షా 86 వేల 17, కూకట్‌పల్లిలో 1 లక్షా 35 వేలా 635, ఉప్పల్‌లో 1 లక్షా 32 వేలా 927, ఎల్‌బీనగర్‌లో 1 లక్షా 11 వేలా 380, మల్కాజిగిరిలో 1 లక్షా 25 వేలా 49, కుత్బుల్లాపూర్‌లో 1 లక్షా 87 వేలా 999, కంటోన్మెంట్‌లో 59 వేలా 57 ఓట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులు సాధించారు. కానీ ఎంపీ ఎన్నికల్లో రాగిడికి అసెంబ్లీ అభ్యర్థులు సాధించిన ఓట్లలో సగం కూడా రాలేదు.

రాగిడితో కలిసిరాని బీఆర్‌ఎస్ కేడర్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఎమ్మెల్యేలతో సహా ఎవరూ సహకరించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ విందులో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేత చామకూర మల్లారెడ్డి రాజేందర్‌ను ఆప్యాయంగా హత్తుకొని 'ఎంపీగా నువ్వే గెలుస్తావు అన్నా' అని అనడం సోషల్ మిడియాలో హల్‌చల్ అయింది. అదే విధంగా బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ, కాంగ్రెస్ వైపు వెళతారనే ప్రచారం జోరవ్వడంతో ఆ పార్టీకి కలిసి రాలేదని వాదన ప్రజల్లో వినిపిస్తోంది.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

రాయదుర్గం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడ్డారు. కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్ ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. సాయంత్రం ఇళ్లకు వెళ్లే వాహనదారులు వరదనీటిలో ఇబ్బందులు పడ్డారు.



భారీ వర్షానికి జలమయమైన రహదారులు



పొంగుతున్న డ్రైనేజీ



రోడ్డుపై నిలిచిన వరదనీరు

టీడీపీ శ్రేణుల సంబురాలు

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

ఏపీలో ఎన్డీఏ కూటమి భారీ మెజార్టీ సాధించడంపై టీడీపీ నాయకులు కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. జై టీడీపీ నినాదాలతో హోరెత్తించారు. కుత్బుల్లాపూర్ కమ్మసేవా సమితి విజయోత్సవాలు నిర్వహించారు. సూరారం కట్టమైసమ్మకు పుట్టా నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో 101 కొబ్బరి కాయలు కొట్టి అమ్మవారికి పూజలు నిర్వహించారు. టీడీపీ ఫౌండర్, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శేరిలింగంపల్లి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కట్ట వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సంబరాలు జరిపి టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ జిందాబాద్ అంటూ బైక్ ర్యాలీలు నిర్వహించారు.



జీడిమెట్లలో విజయోత్సవాలు చేస్తున్న కమ్మ సేవా సమితినాయకులు, టీడీపీ సభ్యులు



చందానగర్ టీడీపీ కార్యాలయంలో నాయకుల సంబరాలు



చందానగర్‌లో జనసేన నాయకుల సంబరాలు



పేట్‌బషీరాబాద్‌లో విజయోత్సవాలు చేస్తున్న టీడీపీ అభిమానులు, నాయకులు



ఫ్యాన్‌ను బండికి కట్టి లాక్కెళుతున్న యువకులు



కూకట్‌పల్లిలో కూటమి నేతలు సంబరాలు



కూకట్‌పల్లి భరత్‌నగర్‌లో టీడీపీ సంబరాల్లో నాయకులు



కేపీహెచ్‌బీ గోపాల్‌నగర్‌లో మంగళవారం రాత్రి సంబురాలు చేసుకుంటున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

నగరంలో కనిపించని ట్రాఫిక్

- పలు ప్రాంతాల్లో ఖాళీగా దర్శనమిచ్చిన రోడ్లు
- సాయంత్రం తర్వాత కనిపించిన హడావిడి

హైదరాబాద్‌సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం ట్రాఫిక్ హడావిడి పెద్దగా కనిపించలేదు. దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ జరుతుండటం.. తెలంగాణలో పాటు ఏపీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై గత కొద్దిరోజులుగా ఉత్కంఠగా ఎదురుచూస్తుండటంతో మంగళవారం ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. దాంతో నగరంలోని రోడ్లపై పెద్దగా వాహనాల హడావిడి లేదు. ట్రాఫిక్ ఇబ్బందులు కనిపించలేదు. కూడళ్ల వద్ద ఎలాంటి ట్రాఫిక్‌జామ్ లేకుండా వాహనాలు సాఫీగా సాగిపోయాయి. అత్యవసరం అయితే మాత్రమే రోడ్డుపైకి వచ్చారు. దుకాణాలు, మాల్స్‌లోనూ జనసంచారం పెద్దగా కనిపించకపోవడంతో బోసిపోయాయి.

అయితే, సాయంత్రానికి కౌంటింగ్ ముగిసి ఫలితాలు వెలువడటం పూర్తయిన తర్వాత జనం రోడ్లపైకి వచ్చారు. గెలిచిన అభ్యర్థుల మద్దతుదారులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. దాంతో సాయంత్రం తర్వాత నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ కనిపించింది. మద్యం దుకాణాలు మూసివేయడంతో మందుబాబులు వైన్స్ షాపుల ముందు దిగాలుగా కూర్చున్నారు.

మధురానగర్ కాలనీలో వాహనాల తనిఖీ



స్వాధీనం చేసుకున్న వాహనాలు

పంజాగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో పలు ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్లు సరిగా లేని, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

రూ.15.86 లక్షలకు టోకరా

మనీ ల్యాండరింగ్ పేరిట వృద్ధుడికి సైబర్ నేరగాళ్ల బెదిరింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): 'మనీ ల్యాండరింగ్ కేసులో మీ పాత్ర ఉందని సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు పాల్పడి ఓ వృద్ధుడి ఖాతా నుంచి రూ.15.86లక్షలు కొల్లగొట్టారు. వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్‌కు చెందిన 80 ఏళ్ల వృద్ధుడు రిటైర్డ్ ఉద్యోగి. రెండు రోజుల క్రితం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ మీద అంధేరీ పోలీస్‌స్టేషన్‌లో మనీ ల్యాండరింగ్ కేసు నమోదైందని, రాజ్‌కుంద్రా చేసిన రూ. వందలకోట్ల కుంభకోణంలో మీకూ పాత్ర ఉన్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. మీపై ఎఫ్ఐఆర్ నమోదైందని, మనీ ల్యాండరింగ్ కేసును సీబీఐకి అప్పగిస్తున్నాం.. మీకున్న మొత్తం ఆస్తులతో పాటు మీ భార్య నగలన్నీ జప్తు చేస్తాం అంటూ బెదిరించారు. ఆ తర్వాత కాల్‌ను సైబర్ క్రైమ్ డిపార్టుమెంట్‌కు బదిలీ చేస్తున్నాం అంటూ నమ్మించి మరో వ్యక్తితో మాట్లాడించాడు. మనీ ల్యాండరింగ్ కేసును త్వరలోనే సీబీఐకి అప్పగిస్తున్నాం. ఈ కుంభకోణంలో మీ పాత్ర ఉందో లేదో తేలంతవరకు మీ ఆస్తులు, మీ భార్య నగలూ జప్తు చేస్తాం' అంటూ సుమారు రెండు గంటలకు పైగా కేసు గురించి వివరిస్తూ వృద్ధుడిని భయభ్రాంతులకు గురిచేశారు. మరుసటిరోజు వీడియోకాల్ చేసిన గుర్తుతెలియని వ్యక్తు లు సీబీఐ నుంచి మాట్లాడుతున్నట్లు కలరింగ్ ఇచ్చారు.

ప్రివెన్షన్ ఆఫ్ మనీల్యాండరింగ్ కేసులో మిమ్మల్ని అరెస్టు చేయాల్సి ఉంటుంది అని భయపెట్టారు. మిమ్మల్ని కేసు నుంచి బయట పడేయాలంటే తమ ఉన్నతాధికారితో మాట్లాడుకోవాలని నమ్మించారు. అలా బాధితున్ని ముగ్గులోకి దింపిన నేరస్థులు కేసులోంచి బయటపడేస్తామంటూ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు లో దాచుకున్న డబ్బు మొత్తం రూ.15.86 లక్షలు సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. ఆ తర్వాత ఆలోచనలో పడ్డ బాధితుడు ఇదంతా కుట్రలా ఉందని అనుమానించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.